క్లుప్తంగా

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కాలేశ్వరరావు

మునగపాక : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మళ్ల కాలేశ్వరరావు కోరారు. నాగులాపల్లిలో శ్రీ రామ తీర్థం సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసి బహుమతులు అందజేశారు. గ్రామాల్లో పండుగలు ఐక్యతను చాటిచెబుతాయన్నారు. మళ్ల అప్పలనాయుడు జ్ఞాపకార్థం నిర్వహించిన కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర పల్లకి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మూలపేట సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక: మూలపేటలో శ్రీరాముల తీర్థ మహోత్సవంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు పాలకవర్గ సభ్యుల సొంత నిధులతో దుస్తులు, దుప్పట్ల పంపిణీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగప్పలనాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ బొడ్డేడ జ్యోష్ణ ఆదికుమార్, పాలసంఘ అధ్యక్షుడు కాండ్రేగుల నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ ఆడారి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు త్వరలో ఉచిత ట్రైసైకిళ్లు



పెట్టుగోళ్లపల్లి నేషనల్ సేవా ట్రస్ట్ బృందం

ఎస్.రాయవరం : గ్రామాల్లో 80 శాతం దివ్యాంగులుగా ఉన్న వారికి ఉచిత ట్రైసైకిళ్లు అందజేస్తున్నట్టు జగన్ నేషనల్ సేవా ట్రస్టు పాయకరావుపేట నియోజకవర్గ చైర్మన్ కనికెళ్ల అమ్మాజీ అన్నారు. పెట్టుగోళ్లపల్లి గ్రామంలో గురువారం జగన్ నేషనల్ సేవా ట్రస్ట్ సభ్యులు బృందం పర్యటించారు. పలువురు దివ్యాంగులను కలిసి మనోధైర్యాన్ని నింపారు. ప్రభుత్వం పింఛన్లు సకాలంలో అందిస్తుందని, వీరికి అవసరమయిన ట్రైసైకిళ్లు త్వరలో అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వియ్యపు వరహాలు పాల్గొన్నారు.

కాంగ్రెసు పార్టీ బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రాకేష్ రెడ్డి

పాయకరావుపేట : కాంగ్రెసు పార్టీని గ్రామస్థాయి నుండి బలోపేతం చేయడానికి పార్టీ నాయకులందరూ కృషి చేయాలని ఉత్తరాంధ్ర జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ పోచారెడ్డి రాకేష్ రెడ్డి అన్నారు. పట్టణంలో పార్టీ నియోజకవర్గ సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైనారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రాకేష్ రెడ్డి మాట్లాడుతూ పార్టీకి రానున్న రోజుల్లో మంచి భవిష్యత్ వుందన్నారు. రాహుల్ గాంధీ చేస్తున్న భారత్ జుడో యాత్ర పార్టీకి ఎంతో ఉత్సాహన్ని ఇచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తుందన్నారు. రాష్ట్రం విభజన సమయంలో ఇచ్చిన హామీలను నేరవేర్చలేదన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు తాళ్ళూరి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా కనకమ్మవారి జాతర

- తండోప తండాలుగా తరలివచ్చిన జనం
- ఉర్రూతలూగించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కనకమహలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు



జాతరలో జనం కోలాహలం

యలమంచిలి : యలమంచిలి కనకమహలక్ష్మి అమ్మవారి జాతర గురువారం ఇక్కడ అంగరంగ వైభవంగా జరిగింది. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి తండోపతండాలుగా జనం జాతరకు తరలి రావడంతో యలమంచిలి జన సంద్రంగా మారింది. ముఖ్యంగా జాతర జాతర జరుగుతున్న ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ పరిసరాలు రాజీవ్ క్రీడా మైదానం, యలమంచిలి ప్రధాన రహదారులు జనంతో కిక్కిరిసిపోయాయి. ఈ జాతరలో సుదూర ప్రాంతాల నుంచి గృహావసరాలకు కావలసిన వస్తు సామాగ్రి దుకాణాలు, రంగులరాట్నాలు, జెయింట్‌వీల్స్,జారుడు బల్లలు ఏర్పాటు చేశారు. యలమంచిలి జాతీయ రహదారి ధర్మవారం పుర వీధుల్లో ఏర్పాటు చేసిన వివిధ విద్యుత్ సెట్టింగ్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు,నేల వేషాలు కోలాటాలు,అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా యలమంచిలి సీఐ షేక్ గఫూర్ , ఎస్ఐ కె. పాపినాయుడు, రూరల్ ఎస్ఐ కె. సన్నిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బందోబస్త్ నిర్వహించారు.

అమ్మవారికి మహిళల ప్రత్యేక పూజలు

ధర్మవరంలో కనకమహాలక్ష్మి అమ్మవారికి ఉదయం 6 గంటల నుంచి మహిళలు అధిక సంఖ్యలో చుట్టు పక్కల ప్రాంతాల నుంచి తరలివచ్చి చీర, రవిక, గాజులు, కుంకుమ, పసుపుతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయ ధర్మకర్త కొఠారు సాంబశివరావు, పట్టణ ఎస్ఐ పాపినాయుడు ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. యలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే యు.వి.రమణ మూర్తిరాజు (కన్నబాబురాజు) అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్త, ఎంపీపీ బోదెపు గోవింద్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు యర్రయ్యదొర, కౌన్సిలర్లు కొఠారు కొండబాబు, పిట్టా సత్తిబాబు, గొర్లె వెంకట్,మరిణీశ్వరావు, రాపేటి సంతోష్ గంధం శివ, వియ్యపు సత్తిబాబు పాల్గొన్నారు.



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అదుపులోకి వచ్చిన అతిసార

- చినతీనార్లను సందర్శించిన అధికారులు
- మరో రెండురోజులు వైద్యశిబిరం



చినతీనార్లను సందర్శించిన అధికారుల బృందం

నక్కపల్లి: మండలంలో చినతీనార్లలో అతిసార వ్యాధి అదుపులోకి వచ్చిందని గొడిచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్ తెలిపారు. గురువారం డీఎల్‌పీవో ఎస్ఎస్ఎన్ మూర్తి, ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ సుబ్రహ్మణ్యశాస్త్రి, ఎస్ఐ శిరీష తదితరులు చినతీనార్లను సందర్శించారు. ఇంటింటికి తిరిగి రెండు రోజుల క్రితం అతిసార లక్షణాలతో బాధపడుతున్నవారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితులంతా తమకు వాంతులు విరేచనాలు తగ్గాయని సకాలంలో గొడిచర్ల పీహెచ్‌సీ వారు వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు, నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించారని అధికారులకు తెలిపారు. పండగ సమయాల్లో నిల్వ ఉన్న చేపలు తినడం వల్ల అందరూ అస్వస్థతకు గురైనట్టు బాధితులు వివరించారు. వైద్యసిబ్బంది సూచనలు పాటిస్తున్నామన్నారు. నిల్వ ఉన్న చేపలు తిన్నవారికే ఈ లక్షణాలు వచ్చాయన్నారు. గ్రామంలో క్లోరినేషన్ కార్యక్రమాలు నిర్వహించారని, వైద్య శిబిరం కొనసాగిస్తున్నారన్నారు. అనంతరం వారు వైద్యశిబిరం వద్దకు వచ్చి ఏఎన్ఎంలను పరిస్థితిపై ఆరా తీశారు. శిబిరం నుంచి మందులు తీసుకెళ్లి వేసుకున్న వారందరికీ వాంతులు విరేచనాలు తగ్గాయన్నారు. ప్రస్తుతం అందరూ కోలుకుని ఆరోగ్యంగా ఉన్నారన్నారు. వైద్య శిబిరం మరో రెండురోజులు కొనసాగించాలని అధికారులు ఆదేశించారు. బావులు, రక్షిత మంచి నీటి పథకాలు, మురుగు కాలువల్లో బ్లీచింగ్ చల్లించాలని కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ, సర్పంచ్ ముసలయ్య పాల్గొన్నారు.

వచ్చే నెల 15లోగా ధాన్యం అమ్మకాలు చేసుకోవాలి

పాయకరావుపేట : ధాన్యం పండించే రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సకాలంలో సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ టి.ఎస్.రాజ్‌కమల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తన పరిధిలో గల నాతవరం, నక్కపల్లి, కోటవురట్ల, మాకవరపాలెం, పాయకరావుపేట మండలాల్లో గల రైతులు ఫిబ్రవరి 15వ తేదీలోగా ధాన్యం అమ్మకాలు చేసుకోవాలన్నారు. ఆయా మండలాల్లో వున్న రైతుభరోసా కేంద్రాల్లో వున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంప్రదించి రైతులు ధాన్యం అమ్మకాలు చేసుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

పాయకరావుపేట : మండలంలో గల శ్రీరాంపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ ఎస్.రమణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శ్రీరాంపురం, పెదరాంభద్రపురం, కేశవరం, రాజవరం, ఎస్.నర్సాపురం, పాల్మన్‌పేట, రాజనగరం, వెంకటనగరం, కుమారపురం, కందిపూడి గ్రామాల్లో విద్యుత్ నిలుపుదల చేయడం జరుగుతుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత నివారణ



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

నక్కపల్లి : సరైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని నర్సీపట్నం డివిజనల్ పంచాయతీ అధికారి ఎ.వి.ఎ స్.మూర్తి, నక్కపల్లి ఎంపీడీవో సీతారామరాజు, ఎస్ఐ శిరీష, గొడిచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌లు పేర్కొన్నారు. గురువారం నక్కపల్లి ఎంపీడీవో సమావేశ మందిరంలో ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు వివిధ ప్రభుత్వశాఖల సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. స్వాభిమాన్ కార్యక్రమం పేరుతో జరిగిన ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ బాల్య వివాహాలను నివారించడం కిషోర బాలికలకు సరైన పోషకాహారం ఇవ్వడం ద్వారా ఇటువంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. కౌమార దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హెమోగ్లోబిన్ శాతం ఉండవలసిన దానికన్నా తక్కువ ఉంటే రక్తహీనతగా భావించవచ్చన్నారు. బలహీనంగా ఉండడం, ఏదైనా పనిచేస్తే ఆయాసం రావడం, అరిచేతులు కాళ్లు పాలిపోవడం, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తే రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించవచ్చన్నారు. సరైన పోషకాహారం తీసుకోకపోవడం వల్లే రక్తహీనత వస్తుందన్నారు. ముఖ్యంగా మహిళలు రుతుక్రమం వల్ల రక్త హీనత వస్తుందన్నారు. ఆకు కూరలు, సజ్జలు, రాగులు డ్రైఫూట్స్, వేరు శనగలు, ప్రోటీన్‌లు అధికంగా లభించే పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. అలాగే నులిపురుగు నివారణ మాత్రలు వాడాలన్నారు. గర్భిణుల్లో రక్తహీనత ఉంటే దాని ప్రభావం పుట్టబోయే బిడ్డలపై చూపిస్తుందన్నారు. ప్రసవ సమయంలో ఎక్కువ రక్తన్ని కోల్పోతే గర్భిణి మరణించే అవకాశం ఉందన్నారు. ఇంట్లో ఆహారాన్ని సమయానికి తీసుకోవాలన్నారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే పోషకాహారం తీసుకోవాలన్నారు. అక్కడ ఇచ్చే ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా వాడాలన్నారు. ఐరన్, విటమిన్ సి ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలన్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కరులు, ఏఎన్ఎంలు గ్రామాల్లో ఉన్న గర్భిణులు, బాలింతల వద్దకు క్రమం తప్పకుండా వెళ్లి రక్తహీనత దాని వల్ల వచ్చే సమస్యలపై అవగాహన కల్పించాలని, వారికి తరచూ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రహ్మణ్యశాస్త్రి, ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ, ఎంఈవో ప్రసాద్, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నివారిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల : బాల్య వివాహాలతో పిల్లల బంగారు భవిత నాశనం అవుతుందని, వాటిని నివారించడంలో అందరూ సమన్వయంగా పనిచేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలికల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా మానసికంగా దృఢంగా ఉండలేరన్నారు. అంతేకాకుండా బాలికల్లో ఎక్కువగా రక్తహీనత కనిపిస్తుందని, వారికి పోషకాహారాన్ని అందించేలా కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలు, రక్త హీనతపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సత్యశ్రీ, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జెట్టీ నిర్మాణానికి స్థల పరిశీలన



గుడివాడ రెవెన్యూ పరిధిలో తీరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఎస్.రాయవరం : బంగారమ్మపాలెం నేవల్ బేస్ నిర్వాసితులకు జెట్టీ నిర్మాణం కోసం గుడివాడ రెవెన్యూ పరిధిలో తీరప్రాంతాన్ని జెట్టీ నిర్మాణ విభాగ అధికారులు గురువారం పరిశీలించారు. అనకాపల్లి జిల్లా ఫిషరీస్ జాయింట్ డైరక్టర్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో సెంట్రల్ డిప్యూటీ డైరక్టర్ ఆఫ్ కోస్టల్ ఇంజినీర్ దలియప్ప తీరప్రాంతాన్ని పరిశీలించారు. బంగారమ్మపాలెం తీరంలో నేవల్ బేస్ రావడంతో ఆ ప్రాంత మత్స్యకారులకు చేపలు వేట చేసుకునేందుకు జెట్టీ అవసరం ఉంది. అయితే ప్రాజెక్టు మొదలు పెట్టి సుమారు 18 ఏళ్లు గడుస్తున్నా జెట్టీ నిర్మాణం చేపట్టాలని మత్స్యకారుల డిమాండ్ అలాగే ఉంది. అయితే జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మరోమారు ఈ ప్రాంతాన్ని పరిశిలిస్తున్నట్టు జేడీ చెప్పారు. తీరంలో తీసుకున్న నమూనాలు 15 రోజుల వ్యవధిలో నివేదిక ఇవ్వనున్నట్టు చెప్పారు.

డైట్‌లో ప్రాంగణ నియామకాలు



ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్, బ్యాంకు అధికారులు

అనకాపల్లిటౌన్ : స్థానిక డైట్ కళాశాల ఆవరణలో గురువారం ఐసీఐసీఐ బ్యాంకు హెచ్ఆర్ బృందం ఎంబీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాంగణ నియామకాలు చేపట్టింది. బ్యాంకు అధికారులు విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు 30 మంది విద్యార్థులు హాజరుకాగా 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ చల్లా నర్సింహం తెలిపారు.

పల్లాకు తెగులు నివారణపై అవగాహన



వైఎస్సార్ పొలంబడిలో పాల్గొన్న వ్యవసాయాధికారులు

ఎస్.రాయవరం : అపరాల సాగు పల్లాకు తెగులు నివారణకు అసరమయిన సస్య రక్షణ చేపట్టాలని మండల వ్యవసాయాధికారి సౌజన్య తెలిపారు. పెట్టుగోళ్లపల్లి గ్రామంలో గురువారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రబీ పంటకాలంలో సాగు చేసే అపరాల సాగును పరిశీలించారు. పంటను ఆశించిన పల్లాకు తెగులును పరిశీలించారు. ఈ మేరకు రైతులకు సస్య రక్షణ పిచికారి విధానాన్ని అవగాహన కల్పించారు. ఈ తెగులు తెల్లదోమ ద్వారా వ్యాపిస్తుందని, తెగులు సోకిన మొక్కలు, ఆకులు కాయలు మీద పసుపుపచ్చ పొడలు ఏర్పడతాయని, తెల్లదోమ నివారణకు లీటరు నీటికి 1.6 మి.లీ మోనోక్రోటోఫాస్ కలిపి పిచికారి చేయాలన్నారు. అదే విధంగా మరిన్ని నమూనాలు వివరాలు రైతులకు వివరించారు.

ఉచిత గుండె వైద్య శిబిరానికి స్పందన

అనకాపల్లిటౌన్ : స్థానిక శ్రీధర్ లాడ్జి దరి వెంకటేశ్వర నర్సింగ్ హోంలో గురువారం మెడికవర్, వాకర్స్ క్లబ్‌లు సంయుక్తంగా ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రముఖ హృద్రోగ నిపుణుడు డాక్టర్ డి.డి.నాయుడు 70 మంది రోగులను పరీక్షించారు. అవసరమైన పరీక్షలు నిర్వహించి, తీవ్ర సమస్యలున్నవారిని గుర్తించారు.

గణపర్తిలో సంపద తయారీ కేంద్రం



గణపర్తి సంపద తయారీ కేంద్రంలో వానపాములను విడుదల చేస్తున్న దృశ్యం

మునగపాక : అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి దత్తత గ్రామం గణపర్తిలో సంపద తయారీ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. కొంత కాలంగా సంపద తయారీ కేంద్రం వినియోగంలోకి రాకపోవడంతో పంచాయతీకి ఆదాయ వనరులు కనిపించేవి కావు. సమస్యను గుర్తించిన ఎంపీ డాక్టర్ సత్యవతి ప్రత్యేక దృష్టి సారించారు. అనకాపల్లి జిల్లా డీపీవో శిరీషారాణి గ్రామంలో పర్యటించి తడి,పొడి చెత్త తయారీ కేంద్రం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. పంచాయతీ పాలకవర్గాన్ని కూడా ఆమె అప్రమత్తం చేశారు. దీంతో సంపద తయారీ కేంద్రం అందుబాటులోకి రావడం అలాగే వానపాములను విడుదల చేసే కార్యక్రమం గురువారం నిర్వహించారు. సర్పంచ్ చదరం నాయుడు, కార్యదర్శి బుజ్జిబాబు తదితరుల చొరవ కారణంగా సంపద తయారీ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీతారామరాజుకు సతీ వియోగం



తంగేడులో పరామర్శ చేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, వైస్ ఎంపీపీ ఆర్.ఎస్.సీతారామరాజు సతీమణి వరలక్ష్మి అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఇటీవల ఆమె అనారోగ్యానికి గురికావడంతో విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో గురువారం మృతిచెందారు. ఈ సందర్భంగా సీతారామరాజును ఎమ్మెల్యే గొల్ల బాబూరావుతో పాటు పలువురు రాజకీయ నాయకులు, బంధువులు పరామర్శించి సంతాపం తెలిపారు. సీతారామరాజుకు బావ అయిన మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, కుటుంబ సభ్యులు మాజీ డీసీసీబీ చైర్మన్ రామచంద్రరాజు, ఏటికొప్పాక ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ రామభద్రరాజు, రాంబాబురాజు తదితరులు ఆయనను పరామర్శించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

మునగపాక : బాల్య వివాహాలను అరికట్టాలని ఎంపీడీవో పి.రవికుమార్ కోరారు. మునగపాక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సాయంత్రం స్వాభిమాన్ కార్యక్రమంలో భాగంగా మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, వెలుగు సిబ్బంది, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనత లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే 10 నుంచి 19 సంవత్సరాల బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన ఇవ్వాలన్నారు. వారిలో వచ్చే మార్పులను గమనిస్తూ ఉండాలన్నారు. మహిళల్లో రక్తహీనత కారణంగా ఆరోగ్య సమస్యలు వస్తాయని, ఇందుకోసం వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలన్నారు. గ్రామాల్లో సభలు నిర్వహించాలన్నారు. డీసీవో లిఖిత, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, తహసీల్దార్ బాబ్జీ, చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్తేర్‌రాణి, సీహెచ్‌వో ప్రవళిక, ఈవోఆర్డీ ఈశ్వరరావు, వెలుగు ఏపీఎం కొండమ్మ పాల్గొన్నారు.

క్లీన్ ఆంధ్రప్రదేశ్‌పై త్వరలో శిక్షణ



నక్కపల్లిలో సిద్ధం చేసిన శిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన డీఎల్‌పీవో

నక్కపల్లి: త్వరలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంపై నక్కపల్లిలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డివిజనల్ పంచాయతీ అధికారి ఎస్ఎస్ఎన్ మూర్తి తెలిపారు. గురువారం ఆయన శిక్షణ తరగతుల కోసం సిద్ధం చేసిన కేంద్రాన్ని పరిశీలించారు. స్వల్ప వ్యవధిలో ఈ శిక్షణ కేంద్రాన్ని సిద్ధం చేసిన ఎంపీడీవో ఈవోపీఆర్‌డీ, పంచాయతీ వారిని అభినందించారు. డివిజన్‌లో 8 మండలాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు, స్వీపర్లకు ఇక్కడ చెత్త నుంచి సంపద తయారీ, వర్మికంపోస్టు తయారీ, క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో కశింకోట, నక్కపల్లి, చీడికాడ కేంద్రాలను ఎంపిక చేశామన్నారు. ఇక్కడ ప్రత్యేకంగా ఈ అంశాలపై శిక్షణ పొందిన రీసోర్స్ పర్సన్‌లు ప్రజా ప్రతినిధులకు శిక్షణ ఇస్తారన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు శిక్షణ ఉంటుందన్నారు. దీనికోసం అన్ని సదుపాయాలతో కూడిన శిక్షణ కేంద్రాన్ని నక్కపల్లిలో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే శిక్షణ తరగతులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ, సర్పంచ్ రత్నకుమారి, ఉపసర్పంచ్ వీసం రాజు, కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా డొంకాడ వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణ తంతు నిర్వహిస్తున్న వేదపండితులు



కల్యాణం తిలకించేందుకు వచ్చిన భక్తులు

నక్కపల్లి : మండలంలో డొంకాడ గ్రామంలో వేంకటేశ్వరస్వామివారి కల్యాణం గురువారం నేత్రపర్వంగా జరిగింది. గ్రామస్తులు, వైస్ ఎంపీపీ వీసం నానాజీ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కల్యాణం తిలకించేందుకు స్థానికులతోపాటు, చుట్టుపక్కల గ్రామాలనుంచి వందలాది మంది తరలివచ్చారు. ప్రతిఏటా సంక్రాంతి అనంతరం ఈ కల్యాణాన్ని అంగరంగవైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులకు ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణ ఘట్టాన్ని వేదపండితులు వైస్ ఎంపీపీ దంపతులు చేతుల మీదుగా నిర్వహించారు. పండక్కి వచ్చిన బంధువులంతా ఈ కల్యాణం తిలకించి వెళ్లడం అనాదిగా వస్తోంది. కల్యాణం అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. డొంకాడ, దోసలపాడు, చీడిక, సీతానగరం, జగన్నాథపురం, గొడిచర్ల, కొత్తూరు, రమణయ్యపేట తదితర గ్రామాల నుంచి భక్తులు కల్యాణం తిలకించేందుకు తరలివచ్చారు. అంతకు ముందు స్వామివారి ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగించారు.

క్యాలండర్, డైరీ ఆవిష్కరణ



డైరీ, క్యాలండర్‌ను ఆవిష్కరించిన సీపీవో రామారావు

తుమ్మపాల : అర్థ గణాంక, ప్రణాళిక శాఖ సబార్డినేట్ అసోసియేషన్ 2023 క్యాలండర్, డైరీలను జిల్లా అర్థగణాంక, ప్రణాళిక శాఖ అధికారి జి.రామారావు గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ సంచాలకులు కె.చంద్రశేఖర్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.వైకుంఠరావు, డిప్యూటీ గణాంక అధికారి జి.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోళ్లు

కశింకోట : మండల రైతుల నుంచి రైతు భరోసా కేంద్రాల ద్వారా ఫిబ్రవరి 15 వరకు ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న తెలిపారు.రైతులు సమీపంలోని ఆర్‌బీకేను సంప్రదించాలన్నారు.